సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 17 । జనవరి । 2023



ఎంత పని చేశావు తల్లీ..!

కన్నతల్లే తన బిడ్డ ప్రాణం తీసిన హృదయ విదారక సంఘటన రాయచోటిలో చోటు చేసుకొంది. మానసిక స్థితి సరిగాలేక ఆమె ఈ ఘాతుకానికి పాల్పడింది - 8లో



ముస్లింల సంక్షేమానికి కృషి

ముస్లింల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. కనుమ సందర్భంగా ముస్లింలకు ఆయన విందు ఏర్పాటు చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.260
రెండోరకం	రూ.90	రూ.156



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 83 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	665	666
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 127.36 కిలోలు

సంబరాల సంక్రాంతి... ఊరంతా కొత్త కాంతి

- ఉల్లాసంగా పల్లెలు, పట్టణాలు
- కోలాహలంగా కనుమ పండుగ
- అంతటా ఆనందోత్సాహాలు
- పెద్దలకు శాస్త్రోక్తంగా కర్మకాండలు
- ముగిసిన సంక్రాంతి ఉత్సవాలు



పీలేరులో చిట్లాకుప్పకు నిప్పు పెట్టిన దృశ్యం

కడప కల్చరల్ : వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలో సంక్రాంతి పండుగను వైభవంగా నిర్వహించారు. భోగితో ప్రారంభమైన ఆనందోత్సాహాలు రెండు, మూడవ రోజైన సంక్రాంతి, కనుమల్లో కూడా వెల్లి విరిశాయి. పల్లెలు, పట్టణాల్లో ఇళ్లు బంధుమిత్రులతో కళకళలాడాయి. బయటి ప్రాంతాల్లో ఉద్యోగం చేసుకుంటూ పండుగ కోసం వచ్చిన వారితో ఇళ్లన్నీ సందడిగా మారాయి. పలుచోట్ల సోమవారం ఉదయాన్నే తలస్నానాలు చేసి పెద్దలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా దివంగతులైన కుటుంబ పెద్దలకు శాస్త్రోక్తంగా కర్మకాండలు జరిపించారు. ముఖ్యంగా కాలువలు, చెరువులు, నదీ తీరాలలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. పుష్పగిరి, కొండపేట, సిద్దవటం నదుల వద్ద చుట్టుపక్కల గ్రామాలతోపాటు కడప నగరం నుంచి కూడా పెద్ద ఎత్తున ప్రజలు తరలివెళ్లి పెద్దలకు పిండ ప్రదానం నిర్వహించారు.

కోలాహలంగా కనుమ

పండుగ చివరినాడు కనుమను సంప్రదాయబద్ధంగా, కోలాహలంగా నిర్వహించారు. పలుచోట్ల స్థానికంగా రైతులు, గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకు ఎడ్ల పందేలు, అల్లెంగుండు ఎత్తడం లాంటి గ్రామీణ పోటీలు నిర్వహించారు. ఇంకొన్నిచోట్ల బిర్రు బండ్లు, బండ్ల పందేలు ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని మండలాల్లోనూ ఎక్కడో ఒకచోట స్థానిక పెద్దలు, యువకులు కలిసి ఆటపాటల్లో పాల్గొన్నారు. ట్రాక్టర్ల రాకతో గ్రామాల్లో ఎద్దుల సంఖ్య తగ్గినా ఉన్నంతలో దాదాపు అన్ని గ్రామాల్లోనూ కనుమ పండుగను పశువుల పండుగగా ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎడ్లు, పశువులను శుభ్రం చేసి పూజలు చేశారు. ముఖ్యంగా ఎడ్లను రంగురంగుల కుచ్చులు, గజ్జెల పట్టీలతో అలంకరించారు. స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో గ్రామాల్లో స్థానికంగా గ్రామీణ ఆటల పోటీలను నిర్వహించారు. పల్లెలతోపాటు పట్టణాలలో కూడా మైదానాల్లో పిల్లలు, పెద్దలు గాలిపటాలు ఎగురవేశారు. నగరంలో మిద్దెలపై నుంచి పిల్లలు పతంగుల ముచ్చట తీర్చుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కబడ్డీ, ఇతర గ్రామీణ క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రాత్రి దేవాలయాల సమీపంలో పార్వేట కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు.

అంతటా ఆనందం

పండుగల్లో ముఖ్యమైనదిగా, పెద్దదిగా భావించే సంక్రాంతిని ఈ సంవత్సరం కూడా జిల్లా వాసులు ఆనందంగా నిర్వహించుకున్నారు. పల్లెలతోపాటు పట్టణాలు, కడప నగరంలో కూడా పండుగ సందడి కనిపించింది. ముఖ్యంగా పల్లెల్లో బంధుమిత్రులతో ఇళ్లు కళకళలాడాయి. కుటుంబ సభ్యులతోపాటు ఇతర మతాలకు చెందిన సన్నిహితులు, మిత్రులను కూడా కనుమ నాడు విందు భోజనానికి ఆహ్వానించారు. రాత్రి వరకు పలు ముచ్చట్లతో ఆనందంగా గడిపారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే మాంసం దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ వినియోగం సగానికి పైగా తగ్గింది. దీంతో చికెన్ సెంటర్ల వద్ద జనం పలుచగా కనిపించారు. కొన్నిచోట్ల మహిళలు బంధుమిత్రులను ఇంటికి ఆహ్వానించి పేరంటాళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు.



రాజంపేట టౌన్ : కలశాలతో గుడిచుట్టు ప్రదక్షిణ చేస్తున్న మహిళలు



మదనపల్లెసిటీ : గొబ్బిపాటలు పాడుతున్న వృద్ధులు



లక్కిరెడ్డిపల్లె : ఇళ్లముంగిట వివిధ ఆకృతులలో వేసిన రంగవల్లులు

పురాతన ఆచారం.. మూగజీవాల వివాహం

వైభవంగా గొర్రె, పొట్టేలు పెళ్లి

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె పంచాయితీ కురవపల్లెలో ఆదివారం రాత్రి గొర్రె, పొట్టేలు పెళ్లి అంగరంగ వైభవంగా నిర్వహించారు. కురవపల్లెలో పురాతన కాలం నుంచి సంక్రాంతి సందర్భంగా మూగజీవాలకు వివాహం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఆదివారం గ్రామంలో గొర్రె, పొట్టేలు వివాహం జరిగింది. హిందూ సాంప్రదాయ పద్ధతిలో జరిగే వివాహం తరహాలో గొర్రె, పొట్టేలకు వివాహం జరిపించారు. పెళ్లి కుమార్తె, పెళ్లికుమారుడు వలె గొర్రె, పొట్టేలుకు ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలోని గొర్రెలు అన్నీ ఒక చోటకు తోలి అక్కడ దొడ్డిగంగమ్మ అమ్మ వారికి విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ప్రమిదలలో దీపం వెలిగించి గౌరమ్మ వారికి పూజలు జరిపారు. సాంప్రదాయబద్ధంగా వక్కాకు శాస్త్రం చేయడం, సారె తీసుకెళ్లడం విశేషం. ఈ సందర్భంగా పిల్లనగ్రోవి, చెక్కభజనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గొర్రె, పొట్టేలు పెళ్లి అనంతరం నెల రోజులకు తిరిగి శివపార్వతులకు విశేష పూజలు (పెద్ద పండుగ) నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

సమాజం సుభిక్షమే లక్ష్యంగా...

సమాజం సుభిక్షమే లక్ష్యంగా పురాతన కాలం నుంచి కురవపల్లెలో గొర్రె, పొట్టేలుకు పెళ్లిచేయడం ఆచారంగా వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇలా చేయడం ద్వారా పంట పొలాలను చీడపీడల నుంచి గౌరమ్మ అమ్మవారు కాపాడతారని విశ్వసిస్తున్నారు. అలాగే కురవ కులస్తులు ఎక్కువగా గొర్రెలు మేపుకుని జీవనం సాగిస్తున్నారని, జీవాలకు ఎలాంటి వ్యాధులు సోకకుండా ప్రతి ఏటా ఈ పండుగ నిర్వహిస్తున్నామని చెబుతున్నారు.



గొర్రెలకు పెళ్లి జరిపిస్తున్న కురవపల్లె గ్రామస్తులు

పెద్దల కాలం నుంచి వస్తున్న ఆచారం



మా తాతల కాలం నుంచి గొర్రె, పొట్టేలుకు పెళ్లి చేయడం ఆచారంగా వస్తోంది. వారి ఆచారాన్ని మేము కొనసాగిస్తున్నాం. మా గ్రామానికి మంచి జరగాలని, మూగ జీవాలను కాపాడాలని గౌరమ్మ పూజలు చేయడం ఆనవాయితీ. ఈ ఆచారంతో అంతా మంచే జరుగుతోంది.

– కంబ్లళ్ల రెడ్డెప్ప, గౌడు, కురవపల్లె.

పుణ్యఫలంగా భావిస్తున్నాం



మా పెద్దల కాలం నుంచి వస్తున్న ఆచారాన్ని మేము మా చేతుల మీదుగా జరిపిస్తుండడం పుణ్యఫలంగా భావిస్తున్నాం. గొర్రె, పొట్టేలుకు వివాహం చేయడం మా గ్రామంలో పెద్ద పండుగ. గౌరమ్మ అనుగ్రహంతో ఈ ఆచారాన్ని ప్రతి ఏటా సాంప్రదాయ పద్ధతిలో కొనసాగిస్తున్నాం.

– చామంచుల శ్రీరాములు, పినపెద్ద, కురవపల్లె.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నది చంద్రబాబే

- పోలీసులను కించపరిచేలా మాట్లాడటం సిగ్గుచేటు
- పోలీసులకు బేషరతుగా చంద్రబాబు క్షమాపణ చెప్పాలి
- కార్యకర్తల పరామర్శ పేరుతో అసభ్య పదజాలం దారుణం
- చంద్రబాబు వ్యాఖ్యలపై రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తీవ్ర స్పందన



రాయచోటి : రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నది మాజీ సీఎం చంద్రబాబునాయుడు, అతని అనుచరులేనని అన్నమయ్య జిల్లా వైఎస్‌ఆర్ సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి తీవ్రంగా ఆక్షేపించారు. సోమవారం అన్నమయ్య జిల్లా పీలేరు పర్యటనలో కార్యకర్తల పరామర్శ పేరుతో చంద్రబాబు పోలీసులనుద్దేశించి మాట్లాడిన తీరుపై ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. రాయచోటిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో తీవ్రవాదం, ఫ్యాక్షనిజం, రౌడీయిజం, నక్సలిజంలను అణచివేసింది తానేనని చంద్రబాబు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాడు నక్సలిజం, ఫ్యాక్షనిజం, తీవ్రవాదం, రౌడీయిజం రాజ్యమేలిన విషయం ప్రజలు మరిచిపోలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో శాంతిభద్రతలు అల్లకల్లోలంగా ఉన్న పరిస్థితుల్లో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వాటిని కూకటివేళ్లతో పెకలించి ప్రజా పాలన అంటే ఏంటో చూపించారన్నారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తన ఐదేళ్ల పాలనలో కూడా చంద్రబాబునాయుడు మా పార్టీ నాయకులు రౌడీలు, కార్యకర్తలు ఏమి చేసినా చూసీ చూడనట్లు వెళ్లాలంటూ జిల్లా కలెక్టర్లకు, ఎస్పీలను ఆదేశించిన విషయం మరిచావా బాబు అంటూ ఆయన నిలదీశారు. నేడు జగన్ కూడా రాష్ట్రంలో రౌడీమూకలు, గుండాలపై కఠినచర్యలు చేపడితే మా కార్యకర్తలు, నాయకులపై దాడులు చేస్తున్నారంటూ ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నాడు గుంటూరు పట్టణంలోని మైనార్టీలపైన దేశద్రోహం కేసు నమోదు చేయించి వారిని చిత్రహింసలకు గురిచేసిన విషయం ఈ రాష్ట్ర ప్రజలు మరిచిపోలేదన్నారు. రాయచోటి పట్టణంలో కూడా అమాయకులైన మైనార్టీలపై కేసులు నమోదు చేయించిన విషయం గుర్తించుకోవాలన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాయచోటి మైనార్టీలపై నమోదైన తప్పుడు కేసులను చట్ట ప్రకారం తొలగించే ప్రయత్నం చేస్తే కోర్టుకు వెళ్లి వాటిపై స్టే తెచ్చినది మీరు కాదా అని శ్రీకాంత్‌రెడ్డి ప్రశ్నించారు. డబ్బులు పోసి, భయపెట్టి, మభ్యపెట్టి కొంతమందిని పోగు చేసుకుని రోడ్లపైకి వచ్చి ప్రశాంతంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్, పెద్దాయనగా పేరున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు సైకోలు అంటూ దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. తనకున్న పబ్లిసిటీ పిచ్చితో ప్రశాంతంగా ఉన్న ప్రాంతాలలో పర్యటిస్తూ అమాయకమైన ప్రజలను రెచ్చగొడుతూ వారి మధ్య విద్వేషాలను వర్గాలను కులమతాలను రెచ్చగొట్టి చంద్రబాబు చలి కాచుకుంటున్నారని విమర్శించారు. శాంతిభద్రతలను ఎప్పటికప్పుడు పరిరక్షిస్తూ, పోలీసులు ఉన్నది 60 వేల మందేనని తాము తలుచుకుంటే ఏమైనా చేస్తామంటూ పోలీసులపై తీవ్ర పదజాలంతో దూషించడం చంద్రబాబు అహంకారానికి పరాకాష్ట అన్నారు. శాంతిభద్రతలే పరిరక్షణగా విధులు నిర్వహిస్తున్న పోలీసులకు చంద్రబాబు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాను మూడు పర్యాయాలు ముఖ్యమంత్రి, దేశంలోనే సీనియర్ రాజకీయ నేతను అని చెప్పుకునే చంద్రబాబు పోలీసులపైన, ముఖ్యమంత్రి, మంత్రులపైన బాబు వాడుతున్న పదజాలం కామెడీషోను తలపిస్తోందన్నారు. ఈ కోవలోనే పండుగ రోజున కూడా పీలేరు పర్యటన ఎందుకు చేపట్టారో ఏమి మాట్లాడదలచుకున్నారో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. చంద్రబాబు పిలుపు పార్టీ ఆదేశాల మేరకు తరలివచ్చిన జనం కూడా బాబు మాటలు విని బాబుకు ఏమైందంటూ జుట్టు పీక్కుంటూ తిరుగు ప్రయాణం చేయడం చంద్రబాబులోని సైకోకు నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.

సంక్రాంతి వేడుకలో మంత్రి పెద్దిరెడ్డి



సంక్రాంతి వేడుకలో మంత్రి పెద్దిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి తదితరులు

వీరబల్లి : అన్నమయ్య జిల్లా మండల కేంద్రం వీరబల్లిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అత్తవారింట సోమవారం సంక్రాంతి వేడుకలను జరుపుకున్నారు. ఆయనతోపాటు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి మంత్రి, ఎంపీలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి వేడుకలకు విచ్చేసిన మామ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మేనల్లుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలకు మండలాధ్యక్షుడు గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, రాజంపేట నియోజకవర్గ యువనాయకుడు మదన్ రెడ్డిలు ఘనంగా స్వాగతం పలికారు. ఓదివీడు ఎంపీటీసీ సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద కేంద్రాన్ని మేమే నిర్మిస్తాం

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయం ఎదురుగా టీటీడీ వారు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అన్నప్రసాద కేంద్రానికి బదులు శాశ్వత అన్నప్రసాద కేంద్ర నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చారు. టీటీడీ అనుమతి ఇచ్చి వారే స్థలాన్ని చూపిస్తే తామే అన్నప్రసాద కేంద్రాన్ని నిర్మిస్తామని ఎంఆర్‌కెఆర్ అధినేత రఘునాథ రెడ్డి ప్రకటించారు. సోమవారం ఒంటిమిట్ట కోదండరాముడిని ఆయన దర్శించుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా కోదండరాముని పార్వేట ఉత్సవం

ఒంటిమిట్ట : ఏకశిలానగరి ఒంటిమిట్టలో సోమవారం సాయంత్రం పరంధాముడి పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కనుమ పండుగను పురస్కరించుకొని టీటీడీ ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోవెలలో శ్రీ సీతారామలక్ష్మణ సమేత ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు శ్రావన్ కుమార్, పవన్ కుమార్ ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం బాజాభజంత్రీల నడుమ ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం జరిపారు. ఈ సందర్భంగా చెరువు వద్ద ఉన్న మండపంలో మూలవిరాట్‌ను ఉంచి కొబ్బరి కాయ కొట్టి పూజలు చేశారు. అలాగే సమీప నాగేటి తిప్పపై టీటీడీ వారు రూ.45 లక్షలతో నూతనంగా నిర్మించిన సులువైన మార్గంలో ఉత్సవ మూర్తులను తీసుకెళ్లి పరంధాముడి పార్వేట ఉత్సవాన్ని ఆలయ సంప్రదాయల పరంగా నిర్వహించారు. అనంతరం మాడవీధుల్లో వైభవంగా స్వామి ఊరేగింపు జరిగింది. భక్తులు గ్రామోత్సవంలో తమకు దర్శనమిస్తున్న స్వామి వారికి కాయకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.



పార్వేటి మండపం వద్ద సీతారామలక్ష్మణులకు హారతులు ఇస్తున్న అర్చకులు

సంతోషాలు లోడింగ్

- ఏడాదికి సరిపడా ఆనందభరిత క్షణాలు
- మధుర స్మృతులను మిగిల్చిన సంక్రాంతి
- బరువెక్కిన హృదయాలతో పయనమవుతున్న బంధువులు



సంక్రాంతికి తీపి గుర్తుగా

రాజంపేట టౌన్ : సంక్రాంతి కోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూసిన ప్రజలు పండుగను పురస్కరించుకొని ఆనందంగా సొంతూళ్ళకు వచ్చారు. ఆశించిన విధంగానే సంక్రాంతి అందరిలోను ఆనందభరితమైన స్మృతులను నింపింది. ప్రజలు పెద్దపండుగ మూడు రోజులు ఘనంగా జరుపుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారంతా సొంతూళ్లలో ఉంటున్న తమ తల్లిదండ్రులతో, తోబుట్టువులతో, చిన్ననాటి స్నేహితులతో సంతోషంగా గడిపారు. పండుగ మూడు రోజులు కలిసి, మెలసి సంతోషంగా జరుపుకున్న ప్రజలు కనుమ పండుగ రోజు సాయంత్రం నుంచే తాము నివసించే ప్రాంతాలకు ఒకొక్కరుగా బయలుదేరడం ప్రారంభించారు. బంధువులు, చిన్ననాటి స్నేహితులు, ఆత్మీయులతో ఆనందంగా గడిపిన వారు బరువెక్కిన హృదయాలతో తిరుగు పయనమయ్యారు.

తల్లడిల్లిన అవ్వా, తాతల మనసు

సంక్రాంతి సందర్భంగా అవ్వ, తాతల ఇంటికి వచ్చిన చిన్నారులు వచ్చీరాని మాటలతో అవ్వా తాతలను మూడు రోజుల పాటు ఆనందడోలికల్లో ముంచెత్తారు. వృద్ధులు తమ మనవళ్లు, మనవరాళ్లతోనే ఎక్కువ సమయం గడిపారు. చిన్నపిల్లలు కావడంతో అవ్వతాతలు వారిని ప్రేమతో చూసుకోవడంతో పాటు అల్లరి చేసినా భరించారు. అయితే మనవళ్లు, మనవరాళ్లు వెళ్లేటప్పుడు వృద్ధుల మనసులు తల్లడిల్లాయి. కొంతమంది అవ్వా, తాతలు కంటతడి పెట్టుకున్నారు. బరువెక్కిన హృదయాలతో తమ పిల్లలను అలాగే వారి పిల్లలను సాగనంపారు.

తీపిగురుతులన్నీ.. సెల్‌ఫోన్‌లలో బందీ

సంక్రాంతి సందర్భంగా జరిగిన అనేక వేడుకలను, ఆనందకరమైన సంఘటనలను ప్రజలు తమ సెల్‌ఫోన్‌లలో బంధించుకున్నారు. ముఖ్యంగా పల్లెసీమల్లోని అందాలను, చిన్ననాటి మిత్రులు, ఆత్మీయులతో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపారు. పరమపదించిన వారి ఫొటోల వద్ద పెట్టిన దుస్తులు, చివరికి వారి సమాధులను సైతం ఫొటోలు తీసి తమ స్టేటస్‌లలో కూడా పెట్టుకున్నారు. తీపిగుర్తుగా గ్రూపు ఫొటోలు దిగారు. అమ్మా, నాన్న, అన్న, చెల్లి, అక్క, తమ్ముడు, బావ, బావమర్ది, మావయ్య, అత్తయ్య, అల్లుల్లు, మనవళ్లు, మనవరాళ్లు ఇలా అందరు ఒకేచోట కలిసిన ఆత్మీయబంధాలను ఫొటోలు, వీడియోల రూపంలో మరో ఏడాది పాటు దాచుకునేందుకు సెల్‌ఫోన్‌లు ఎంతగానో దోహదపడ్డాయి.

సంప్రదాయ దుస్తులలో మెరిసిన నగరవాసులు

భోగి, సంక్రాంతి, కనుమ, గొబ్బెమ్మ పండుగలను ప్రజలు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా నిర్వహించారు. మెట్రోపాలిటిన్ సిటీల్లో ఆధునిక జీవనానికి అలవాటు పడి, మోడరన్ దుస్తులు ధరించే వారు సైతం సంక్రాంతి సందర్భంగా మూడు రోజులు సంప్రదాయ దుస్తుల్లో మెరిసి, తెలుగుదనం ఉట్టిపడేలా కనిపించారు.

చాలా ఏళ్ల తరువాత..



చాలా ఏళ్ల తరువాత మేము సంక్రాంతికి రాజంపేటలోని పెదనాన్న, బాబాయ్ వాళ్ల ఇంటికి వచ్చాము. కజిన్స్ అంతా కలిసి డ్యాన్స్‌లు వేశాము. బావలపై మేము సరదాగా జోకులు వేయడం, ప్రతిగా వాళ్లు జోకులు వేయడం వంటి వాటితో మూడు రోజులు క్షణాల్లాగా గడిచిపోయాయి. చెల్లి, అక్కావాళ్లు తెల్లవారుజామునే లేచి అందరు కలిసి ముగ్గులు వేశారు. గతంలో ఎ ప్పుడు లేని విధంగా ఈ సంక్రాంతిని ఎంజాయ్ చేశాము.

– శివ, హెచ్‌ఆర్ మేనేజర్, హైదరాబాద్

ఏందో నాయన ఈ బంధాలు



పండగకు కూతురు, అల్లుడు, కొడుకు, కోడలు వాళ్ల పిల్లలు వచ్చారు. ముఖ్యంగా మనవళ్లు, మనవరాళ్లు తాతా, అవ్వా అంటూ మా చుట్టే తిరుగుతూ సంతోషంగా మాతో ఆడుకుంటూ మమ్మల్ని సంతోషపెట్టారు. సంక్రాంతి పుణ్యమా అని మేము పిల్లోల్లతో ఎంతో ఆనందంగా గడిపాము. స్కూళ్లు తెరుస్తున్నారు, సెలవు లేదని పిల్లలంతా ఒకేసారి బయలుదేరుతున్నారు. చాలా బాధగా ఉంది. ఏందో నాయనా ఈ బంధాలు, అనుబంధాలు.

– బసిరెడ్డి రామసుబ్బారెడ్డి, రాజంపేట

ముస్లిం మైనారిటీల ద్రోహి చంద్రబాబు

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : ముస్లిం మైనారిటీల ద్రోహి చంద్రబాబునాయుడు అని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డులో ముస్లిం మైనారిటీల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు మొదటి నుంచి కులాల కుంపటి రాజేసి మతాల మధ్య చిచ్చు రేపుతున్నారని ఆరోపించారు. టీడీపీ కార్యకర్తలను పరామర్శించడానికి పీలేరుకు వచ్చిన చంద్రబాబు ఇటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ఎక్కడికెళ్లినా కంటికి రెప్పలా కాపాడుతున్న పోలీసులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో ఎమ్మెల్యేలు గెలుపొందుతున్నారని పేర్కొన్నారు. పెద్దిరెడ్డిని ఎదుర్కొనే సత్తాలేకనే కుల, మత రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తన నీతిమాలిన రాజకీయాల కోసం ముస్లిం మైనారిటీలపై కపట ప్రేమ వలకబోస్తున్నారని మండిపడ్డారు. మీ హయాంలో మైనారిటీల అభివృద్ధికి ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పలు అల్లర్లు జరగడానికి చంద్రబాబే కారణమవుతున్నారని తెలిపారు. మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ముస్లిం మైనారిటీలకు ఎలాంటి పదవులు దక్కలేదని గుర్తు చేశారు. దివంగత నేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి మైనారిటీల జీవితానికి భరోసా ఇచ్చారన్నారు. టీడీపీ నేత కిషోర్‌కుమార్ రెడ్డి ముస్లిం మైనారిటీలను కుక్కలతో పోల్చి మాట్లాడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆఘా మొహిద్దీన్, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, డాక్టర్ హబీబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

మహిళపై దాడి


గాయపడిన నాగమనెమ్మ

తంబళ్లపల్లె : భూమి విషయమై ఓ మహిళపై దాడి జరిగిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కోటకొండ ఎగువతండాకు చెందిన నాగమనెమ్మ అనుభవంలో ఉన్న భూమిని.. అదే తండాకు చెందిన శకుంతమ్మ, కుమారుడు రాజ్‌కుమార్ జేసీబీతో చదును చేసి ఆక్రమించుకునేందుకు యత్నించారు. నాగమనెమ్మ అడ్డుకోవడంతో ఆగ్రహించిన పై ఇద్దరితోపాటు సరోజమ్మ, రవీంద్ర నాయక్ దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. ఈ విషయంపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బాలిక అదృశ్యం


గాయిత్రి (ఫైల్)

రామసముద్రం : కళాశాలకు వెళ్లిన తన కుమార్తె తిరిగి ఇంటికి రాలేదని ఊలపాడు గ్రామానికి చెందిన కనగాని శ్రీనివాసులు రామసముద్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసులు కుమార్తె గాయిత్రి (17) పుంగనూరు ఎంసీవి కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. రోజూ కళాశాలకు ఉదయం వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేది. అలాగే ఈ నెల 12న ఉదయం వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు.

ఎంత పని చేశావు తల్లీ..!

- కన్న కూతురి ప్రాణం తీసిన అమ్మ
- గొంతు నులిమి.. హత్య చేసి..
- మానసిక స్థితి సరిగా లేక.. ఘాతుకానికి పాల్పడిన వైనం



తన కుమార్తెతో తండ్రి మహమ్మద్ బాషా (ఫైల్), మృతి చెందిన రుక్సానా

రాయచోటి టౌన్ : కడుపులో పెరుగుతున్నప్పటి నుంచే తల్లి ఎంతో అల్లారుముద్దుగా చూసుకుంటుంది. భూమి పైకి వచ్చిన తర్వాత కంటికి రెప్పలా కాపాడుతుంది. కట్టుకున్న భర్త పట్టించుకోకపోయినా.. నా అన్న వారు పలకరించకపోయినా.. చివరికి తాను ఏకాకై నా సరే సర్వం ధారపోసి బిడ్డలను ప్రయోజకులుగా తీర్చిదిద్దుతుంది. అలాంటి అమ్మ తన కడుపున పుట్టిన బిడ్డను తన చేతులతోనే కర్కోటకంగా గొంతు నులిమి చంపిన సంఘటన రాయచోటిలో చోటుచేసుకుంది. ఈ ఘటన శనివారం రాయచోటి పట్టణ శివారులోని పెమ్మాడపల్లె గ్రామం పొలాల వద్ద ఉన్న నక్కలగుట్టలో జరిగింది. మానసిక స్థితి సరిగా లేకపోవడం, అనవసర భయంతో ఆమె ఈ దుర్ఘటనకు పాల్పడింది. అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పీలేరులోని చెన్నారెడ్డి వీధికి చెందిన షేక్ మహమ్మద్ బాషా సంబేపల్లె మండలం చౌటపల్లె గ్రామం షేక్ ఫాతిమాను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి రుక్సానా (10 నెలల) కుమార్తె ఉంది. ఫాతిమా మానసిక స్థితి సరిగా లేదు. ఆమె భర్త ఇంటి నుంచి అప్పుడప్పుడూ చెప్పకుండా పుట్టింటికి వచ్చేది. తన ఆరోగ్యం సరిగా లేదని, త్వరగా చనిపోతానని భావించింది. తాను చనిపోతే తన బిడ్డను ఎవరు చూసుకుంటారు అనే అనుమాన పడింది. ఎవరూ చూసుకోరనే నిర్ణయానికి వచ్చింది. అనుకున్నదే తడువుగా శనివారం తన పసిబిడ్డను తీసుకొని రాయచోటికి వచ్చింది. అక్కడి నుంచి పుట్టింటికి వెళ్లేందుకు మనసు నచ్చక రాయచోటిలోనే ఆగిపోయింది. రాయచోటి పట్టణ శివారులోని పెమ్మాడపల్లె సమీపాన ముళ్ల పొదల వద్ద ఉన్న గుట్టల్లోకి తీసుకెళ్లి కుమార్తె గొంతు నులిమి చంపేసింది. కుమార్తె మృతదేహాన్ని తన భుజాలపై వేసుకొని రాయచోటికి వచ్చి, అక్కడి నుంచి తిరిగి పీలేరుకు వెళ్లింది. అప్పటికే రాత్రి కావడంతో పీలేరు నుంచి భర్త బంధువులకు ఫోన్ చేసి తన బిడ్డను చంపేశానని, వచ్చి తీసుకెళ్లాలని చెప్పింది. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా చిన్నారి విగతజీవిగా పడి ఉంది. బంధువులు పాప శవాన్ని తీసుకొని రాయచోటి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆదివారం నిందితురాలిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. వారు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్


పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసులో నిందితులు

రాయచోటి టౌన్ : గంజాయి అమ్ముతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకరరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం రాయచోటి – లక్కిరెడ్డిపల్లె రింగ్ రోడ్డు వద్ద గంజాయి విక్రయిస్తున్న పవన్‌కుమార్ అలియాస్ కుండల పవన్‌కుమార్, శ్రీకాంత్ అలియాస్ లడ్డు అలియాస్ బ్లాస్ట్, న్యాజీ ఇమ్రాన్ బాషాను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 3.8 కిలోల గంజాయి, బైక్ స్వాధీనం చేసుకున్నారు. వీరు మారుమూల ప్రాంతాలలో నుంచి తీసుకొచ్చి చిన్నమండెం మండలంలో అమ్మేవారని విచారణలో వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట కేసులో టీడీపీ నేత అరెస్ట్

రాజంపేట : పట్టణ శివారులోని ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఏర్పాటు చేసుకున్న గదిలో కొన్ని రోజులుగా రియల్ ఎస్టేట్ వ్యాపారి గంపశివ అనే టీడీపీ నాయకుని కనుసన్నల్లో పేకాట ఆడుతున్నట్లు పోలీసు శాఖకు సమాచారం అందింది. పట్టణ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గంపశివతోపాటు ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.21,820 స్వాధీనం చేసుకున్నారు.

ఇసుక లారీ బోల్తా.. వ్యక్తి మృతి


టిప్పర్ కింద నుజ్జునుజ్జయిన ద్విచక్ర వాహనం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లి సమీపంలోని ఓ మలుపు వద్ద పాపాఘ్ని నది నుంచి ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీ బోల్తా పడింది. అదే సమయంలో కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా చిల్లరపల్లికి చెందిన మల్లికార్జునరెడ్డి (32) ద్విచక్ర వాహనంలో వస్తుండగా.. టిప్పర్ అతని వాహనంపై పడింది. ఈ ఘటనలో కొన ఊపిరితో ఉన్న ద్విచక్ర వాహనదారుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధురామచంద్రుడు సోమవారం పేర్కొన్నారు.

వాహనం ఢీకొని కృష్ణ జింక మృతి

ములకలచెరువు : గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఒక కృష్ణజింక మృతి చెందిన సంఘటన సోమవారం మండల సరిహద్దులో చోటుచేసుకుంది. స్థానికులు, అటవీ శాఖ అధికారుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలం సరిహద్దు పులికల్లు సమీపం వద్ద జింకల మంద రోడ్డు దాటుతుండగా.. వాహనం ఒక జింకను ఢీకొంది. ఈ ప్రమాదంలో జింకకు తీవ్ర గాయాలయ్యాయి. అటువైపు వెళ్తున్న ప్రయాణికులు గమనించి ప్రాణంతో ఉన్న జింకకు నీళ్లు తాపించి అటవీ శాఖ బీటు అధికారి సుధాకర్, గోపాల్‌కు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకునేలోపు జింక మృతి చెందింది. పశువైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి సంగ్రడవిలో ఖననం చేసినట్లు అటవీశాఖ అధికారి పేర్కొన్నారు.


జింకను ఖననం చేస్తున్న అటవీ శాఖ అధికారులు

ఆర్వోబీ కింద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



రాజంపేట : రాజంపేట ఆర్వోబీ కింద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. అతని వయసు 40 ఏళ్లు ఉండవచ్చని పేర్కొన్నారు. చిత్తు కాగితాలు ఏరుకుంటూ, మద్యం సేవిస్తూ ఆర్వోబీ స్పాన్ కింద జీవనం సాగించే వాడన్నారు. మృతదేహాన్ని ఏరియా హాస్పిటల్‌లో భద్రపరిచామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఢీకొన్న లారీ, కార్లు

8 మందికి గాయాలు


బాధితులను 108లో తరలిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చెర్లోపల్లి సమీపాన ఉన్న జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున లారీ, రెండు కార్లు ఢీకొనడంతో 8 మందికి గాయాలు అయ్యాయి. ఎస్‌ఐ మధుసూదన్ రావు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నై వైపు బొగ్గు లారీ వెళ్తోంది. పులివెందులకు రెండు కార్లు వెళ్తున్నాయి. ఎదురెదురుగా వస్తున్న లారీ, రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులలో వెళ్తున్న కులాయప్ప(30), శ్రీనివాసులు(50), ధనలక్ష్మి(46), విజయకుమారి(24), శ్రీవాని(24), గాయత్రి(27), రమణమ్మ(48), పండు (50) గాయాల పాలయ్యారు. వారిలో శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ అదుపు తప్పి..

పలువురికి తీవ్ర గాయాలు


బాధితురాలిని 108లోకి తీసుకెళ్తున్న బంధువులు

రామసముద్రం : వాలీశ్వరకొండపై గుడికి వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి పడిపోవడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఆర్.నడింపల్లి పంచాయతీ బల్లసముద్రం సమీపంలోని కొండపై ఉన్న శ్రీ వాలీశ్వరస్వామికి ఆర్.నడింపల్లె గ్రామానికి చెందిన భక్తులు మొక్కు తీర్చుకునేందుకు సోమవారం ట్రాక్టర్‌లో బయలుదేరారు. కొంత దూరం కొండపై వెళ్లిన తర్వాత ట్రాక్టర్ ట్రాలీ కొక్కి ఊడిపోవడంతో ట్రాలీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న సుశీలమ్మ, విజయకుమారి, లలితమ్మ, వసంతమ్మ, చౌడమ్మ, నలినితోపాటు మరి కొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే విషయం తెలుసుకున్న గ్రామస్తులు కొండ ప్రాంతానికి చేరుకొని బాధితులను రామసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. కాగా పెను ప్రమాదం తప్పి ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు ఆత్మహత్యకు ప్రయత్నించారు. పట్టణంలోని బికెపల్లె పంచాయతీ వైఎస్సార్ కాలనీకి చెందిన జబీవుల్లా (22) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆయన భార్య నాజియా తబ్సుమ్ భర్తతో గొడవపడి ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాలేదన్న మనస్తాపంతో జబీవుల్లా సోమవారం పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన మోహతాజ్ (28), ఆమె భర్త గొడవ పడ్డారు. ఆమె చీమల నివారణ మందు తాగి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా పుంగనూరు మండలం కుమ్మరకుంట గ్రామానికి చెందిన మునిరామప్ప (40) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది సోమవారం గుళిక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పట్టణంలోని బసినికొండ పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన గంగాధర్ (19) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. స్థానికంగా ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఆమె ప్రేమ నిరాకరించడంతో ఆదివారం కత్తితో చెయ్యి కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఉప సర్పంచ్ మృతి


రామ్మూర్తి మృతదేహం

కలికిరి/ వాల్మీకిపురం : పీలేరు నియోజకవర్గంలోని వాల్మీకిపురం మండలం మాధవరంపల్లి గ్రామం ఉపసర్పంచ్ సి.రామ్మూర్తి(46) ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మాధవరంపల్లికి చెందిన రామ్మూర్తి ఆదివారం కలికిరి మండలం అద్దవారిపల్లి పంచాయతీ గల్లావారిపల్లిలో తన బంధువుల ఇంటికి సంక్రాంతికి వెళ్లాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో కలకడ-కలికిరి రోడ్డు గుంటివీరన్నపల్లి వద్ద చౌడేపల్లి మండలానికి చెందిన గుణశేఖర్ తన ద్విచక్రవాహనంలో అతివేగంగా వచ్చి రామ్మూర్తి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రామ్మూర్తికి తీవ్ర గాయాలు కాగా పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ మధుసూధనాచారి తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఏపీఎండీసీ డైరెక్టర్ హరీషరెడ్డి ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రామ్మూర్తి మృతి పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ వాల్మీకిపురం మండల కన్వీనర్ నీళ్ళ భాస్కర్, సర్పంచ్ వెంకటరమణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సతీష్ కుమార్‌రెడ్డి తదితరులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు.

జూద స్థావరాలపై దాడులు

మదనపల్లె : జూద స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించి పలువురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నగదు, కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంక్రాంతి సందర్భంగా ఆదివారం మండలంలోని సీటీఎం పంచాయతీ మిట్టపల్లె వద్ద కోడిపందెం ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసి, రూ.10,500, నాలుగు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కోళ్లబైలు పంచాయతీ కాట్లాటపల్లె సమీపంలో కోడి పందెం ఆడుతున్న మరో 11 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.5,500, నాలుగు పందెం కోళ్లు స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. ఎగువ కురవంక సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4,900 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో నీరుగట్టువారిపల్లె వద్ద రామిరెడ్డి లేవుట్ సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.3,030 స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు. అదే విధంగా బుగ్గకాల్వ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2110 స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో తాలూకా ఎస్‌ఐలు చంద్రశేఖర్, సుధాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీపీపీ ఉద్యోగికి గాయాలు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో జేపీఏగా పని చేస్తున్న శివరామయ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కలమల్ల ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రగుంట్లకు చెందిన శివరామయ్య ఆర్టీపీపీలో జేపీఏగా పని చేస్తున్నాడు. ఆర్టీపీపీ నుంచి స్కూటర్‌లో ఇంటికి బయలు దేరాడు. సున్నపురాళ్లపల్లె గ్రామం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఎటీఎంకు వెళ్లే సీఎంఎస్ వాహనం వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన గాయపడ్డాడు. వెంటనే చికిత్స కోసం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి..

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో టమాట రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. కలకడ మండలం కొవ్వూరివాండ్లపల్లెకు చెందిన రైతు చంద్రబాబునాయుడు (40) మదనపల్లె సమీపంలోని కర్ణాటక రాష్ట్రం రాయల్పాడులో టమాట పంట లీజుకు తీసుకున్నాడు. ఈ క్రమంలో పొలం వద్దకు వెళ్లి పనులు ముగించుకుని తిరిగి ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా వేంపల్లె క్రాస్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చెట్టుపై నుంచి పడి..

చెట్టుపై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన రామసముద్రం మండలంలో సోమవారం జరిగింది. అరికెల పంచాయతీ కురవూరుకు చెందిన వెంకటరమణ (50) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి వద్దనున్న చెట్టును ఎక్కి విద్యుత్ తీగలపై వేలాడుతున్న కొమ్మలను కొడవలితో నరుకుతుండగా.. పట్టుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా పీరయ్యస్వామి ఆరాధనోత్సవాలు


ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

చిన్నమండెం : మండల పరిధి చిన్నర్సుపల్లె పంచాయతీ మఠంలోని శ్రీ పీరయ్యస్వామి ఆరాధనోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. మఠం పీఠాధిపతి నాగలింగమయ్యస్వామి ఆధ్వర్యంలో రెండు రోజులుగా పీరయ్యస్వామి సమాధి వద్ద వారి కుటుంబీకులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం పీరయ్యస్వామికి అభిషేకాలు, సమాధి అలంకరణ కార్యక్రమాలతోపాటు రాత్రి అఖండ భజనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాత్రి బద్వేలు నటరాజనాట్యమండలి వారిచే శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర నాటకాన్ని ప్రదర్శించారు. ఆదివారం ఉదయం మౌలాలి జెండా ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఉదయం నుంచి నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ముస్లింల సంక్షేమానికి నిరంతర కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట : నియోజకవర్గంలోని ముస్లింల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం మేడా భవన్‌లో ముస్లింలకు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముస్లింలకు పెద్ద ఎత్తున ఆత్మీయ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ముస్లింలు, క్రైస్తవులకు మేడా కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని రాజంపేటలో వారికి కులపరంగా వున్న సమస్యలను పరిష్కరిస్తూ వచ్చామన్నారు. వేర్వేరుగా శ్మశాన వాటికలకు స్థలాలను కేటాయించడం జరిగిందన్నారు. వాటి అభివృద్ధికి నిధులు కేటాయించడం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే సోదరుడు ఎంఆర్‌కేఆర్ సంస్థ అధినేత మేడా రఘునాథరెడ్డి మాట్లాడుతూ తెలుగువారి పెద్దపండుగ సంక్రాంతి అని, ఆ రోజున ముస్లింలకు ఆత్మీయ విందు ఇవ్వడం ఆనవాయితీగా చేపడుతున్నామన్నారు. కరోనా నెలకొన్న పరిస్థితుల్లో ఇవ్వలేకపోయామని, ఈ ఏడాది నుంచి మళ్లీ ఆ ఆనవాయితీని కొనసాగిస్తున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,500 మంది ముస్లింలకు ఆత్మీయ పలకరింపులతోపాటు విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం, క్రైస్తవ పెద్దలు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మేడా రఘునాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, సిద్దవటం ఇన్‌చార్జి మేడా మధుసూదనరెడ్డిలకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఆర్‌ఐడీసీ స్టేట్ డైరెక్టర్ గండికోట గుల్జార్‌బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, ఫరూక్, షేక్ హైదర్‌బాషా, షేక్‌జాహిద్ అలీ, పటాన్ ఖాజామోహిద్దీన్, మున్వర్‌బాష, సయ్యద్ అఫ్సర్, సుండుపల్లె జెడ్పీటీసీ ఇస్మాయిల్, సర్పంచి రఫీ, నందలూరు కో–ఆప్షన్ మెంబర్ కలీం, సిద్దవటం జవహర్‌బాష, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ సమియా, ముజఫర్, అల్‌బదర్ మసీదు నయమతుల్లా, నజీర్, అన్వర్, మునాఫ్, ఎల్లాగడ్డ మసీదు మస్తాన్, ఖలీల్, రిటైర్డ్ డీఎఫ్‌ఓ ఖాదర్‌వల్లితోపాటు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.